క్లుప్తంగా

రేపటి నుంచి పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ

మడకశిర: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి స్థానిక ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు పుట్ట గొడుగుల పెంపకం, టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శిక్షణ ఇన్‌చార్జ్ నాగసాయిప్రసాద్ తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు ఉన్న వారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీర జవాన్లకు ఘన నివాళి



రొద్దంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: భారత్–పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు బుధవారం సాయంత్రం రొద్దం మండల కేంద్రంలో ప్రజలు నివాళులర్పించారు. పెద్ద ఆంజనేయస్వామి దేవాలయం నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు, వ్యాపారులు, యువకులు, సామాజిక సేవాకర్తలు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీర జవాన్లకు ఘన నివాళులర్పించారు. సైనికులకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీర జవాన్ల కుటుంబాలకు, దేశానికి అండగా ఉంటామన్నారు. బస్‌స్టాండ్ ఆవరణంలో రెండు నిముషాలు మౌనం పాటించారు.

యువతి అదృశ్యం



కవిత (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు పంచాయతీ కేంద్రంలో నివాసం ఉన్న మల్లికార్జున కుమార్తె ఎం.కవిత (24) ఈ నెల 6న అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మల్లికార్జున వివరాలమేరకు.. మల్లికార్జునకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె ఎం.కవిత డిగ్రీ వరకూ చదువుకుంది. బెంగళూరులో ఓ కంపెనీలో పని చేస్తూ ఉండేది. మూడు నెలలుగా ఇంట్లోనే ఉండి కుటుంబానికి ఆసరాగా ఉంటోంది. అయితే ఈ నెల 6వ తేదిన అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి నుంచి ఉన్నఫళంగా ఎటో బయటికి వెళ్లిపోయింది. యువతి ఎం.కవిత తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు జమేదార్ రామలింగయ్య తెలిపారు.

కూలీలకు పనులు కల్పించండి

సోమందేపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ కూలి పనులు కల్పించాలని ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో కచ్చితంగా పనులు కల్పించడంతో పాటు రూ.300 కనీస కూలి అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సోమశేఖర్ రెడ్డి, ఏసీ అన్న పూర్ణ తదతరులు పాల్గొన్నారు.

రొళ్ల ఎంపీడీఓగా నాగేశ్వరశాస్త్రి



రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాయలంలో మండల అభివృద్ధి అధికారిగా వై.నాగేశ్వరశాస్త్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎంపీడీఓగా పని చేసిన కె.ఆజాద్ గత ఏడాది రామగిరి మండల పరిషత్ కార్యాలయాని బదిలీ అయ్యారు. అప్పటి నుంచి అమరాపురం ఎంపీడీఓగా పనిచేస్తున్న రామరావు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. బెళుగుప్ప మండలంలో ఈఓఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై నాగేశ్వరశాస్త్రి రొళ్ల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోండి



కార్యదర్శులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీకి రూ.92.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. సచివాలయ సిబ్బంది తమ వార్డుల పరిధిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో వార్డుల అభివృద్ధిపై మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయా వార్డులలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రతివార్డును సందర్శించి ప్రజలకు అత్యవసరమైన రహదారులు, కాలువలు ఏర్పాటు చేసే నిమిత్తం ప్రాధాన్యపరంగా ప్రతిపాదనలు చేసి నివేదికను అందించాలన్నారు. రోడ్లు, కాలువలు, లైటింగ్ వంటివి పరిశీలించాలన్నారు.



సర్వర్ డౌన్!

- రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు చుక్కలు
- పనిచేయని సర్వర్‌తో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- కొన్నింటికి ఆప్షన్ లేకపోవడంతో అవస్థలు



హరేసముద్రంలో ఈ-కేవైసీ కోసం ప్రయత్నం చేస్తున్న దృశ్యం



సర్వర్ సమస్యతో అగళి గ్రామ సచివాలయం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

మడకశిరరూరల్/అమరాపురం: అర్హత ఉన్న వారు కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు మార్పులు , చేర్పులు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే సర్వర్ సమస్యతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

గ్రామ సచివాలయాల దగ్గరే తిష్ట

గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారులు కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన వారు గ్రామ సచివాలయాలకు వెళ్తున్నారు. అయితే సర్వర్ సమస్యతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి అక్కడే నిరీక్షిస్తున్నా సర్వర్ సమస్య ఉందని, మళ్లీ రావాలని గ్రామ సచివాలయ సిబ్బంది చెబుతుండటంతో అవస్థలు పడుతున్నారు. అదే విధంగా మార్పులు, చేర్పులకు కూడా ఈ-కేవైసీ చేయించడానికి అధికారులు ఎంత ప్రయత్నం చేస్తున్నా సర్వర్ తీసుకోవడం లేదని అంటున్నారు. రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ మొదలైనప్పటి నుంచి సర్వర్ సమస్యతో గ్రామీణుల ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి సచివాలయం వద్దే సాయంత్రం వరకూ వేచి చూస్తున్నా పనిజరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి స్వగ్రామాలకు వచ్చి దరఖాస్తులు చేసుకుంటున్న వారి పరిస్థితి దారుణంగా మారింది. పొట్టపూటి కోసం నగరాలకు వలస బాట పట్టామని, రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు యత్నిస్తుంటే సర్వర్ పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్య ఉందని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు గడువును పొడిగించాలి

నూతన రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు మార్పులు, చేర్పులకు ఈ నెల 30 వరకూ ప్రభుత్వం గడుగు కేటాయించింది. సర్వర్ సమస్య నెలకొనడంతో వచ్చే నెల వరకూ గడువు పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మడకశిర నియోజకవర్గంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న సచివాలయాల్లో సర్వర్ సమస్యతో పాటు నెట్‌వర్క్ (సిగ్నల్) సమస్య ఉండటంతో లబ్ధిదారులు మరింత ఇబ్బంది పడుతున్నారు.

ఆప్షన్ లేక అవస్థలు

ఉమ్మడి కుటుంబంలో బియ్యం కార్డులో ఉండి వివాహమైన వారు ఉమ్మడి కార్డు నుంచి విడదీయాలని అడిగితే ఆప్షన్ లేదని అధికారులు చెబుతున్నారని అమరాపురానికి చెందిన దేవరాజు, కృష్ణమూర్తి, మంజునాథ వాపోతున్నారు. మొదట నూతనంగా పెళ్లైన వారు భార్యను కార్డులోకి చేర్చుకోవాలని అది ఓకే అయిన తర్వాత మళ్లీ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


తప్పుల తడకగా..

అమరాపురం మండలం కె.గొల్లహట్టిలో పాలన్న కుమారుడు చందన్‌కుమార్‌తో పాటు సచివాలయానికి వెళ్లి రేషన్ కార్డులో చేర్చుకోవాలని కోరగా ఆధార్ చూసి పిల్లవాడు చనిపోయాడని చూపిస్తోందని ఉద్యోగులు తెలిపారు. తమ కుమారుడు బతికి ఉంటే ఎలా చనిపోయినట్లు చూపుతుందని బాధితుడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

సమస్య లేకుండా చూస్తాం

కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అయితే సర్వర్ సమస్యతో ఇబ్బంది వస్తోంది. టెక్నికల్ సమస్య కారణంగా సమస్య వచ్చింది. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాం. సర్వర్ సమస్య లేకుండా చూస్తాం.

– లక్ష్మీనరసింహ, డిప్యూటీ తహసీల్దార్, మడకశిర



హిందూపురం	34.0
పెనుకొండ	38.0
మడకశిర	34.0

సజావుగా మండల మీట్



మాట్లాడుతున్న ఎంపీపీ గీత

పెనుకొండ రూరల్: స్థానిక ఎంపీపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గీత అధ్యక్షతన ఏర్పాటు చేశారు. వివిధ శాఖల అధికారులు అభివృద్ధి పనులపై చర్చించారు. ఉపాధి హామీ మండలాధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 40 పశువుల నీటి తొట్టిలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం రాజు మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా సంఘాలలో ఉన్న మహిళా సభ్యులకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని పంచాయతీల అభివృద్ధి కోసం ఒక్కో ఎంపీటీసీకి రూ.3 లక్షలు నిధులు కేటాయిస్తున్నట్లు ఎంపీపీ గీత తీర్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాగ్యరేఖ, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డబ్బు అధికంగా వసూలు చేస్తే చర్యలు



మీసేవ నిర్వాహకుడితో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి

రొళ్ల: ప్రభుత్వం నిర్ధారించిన ధరల మేరకు మీసేవా నిర్వాహకులు వివిధ సర్టిఫికెట్లకు ప్రజల నుంచి డబ్బు వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి రత్నగిరి–అగళి ప్రధాన రోడ్డు పక్కన నిర్వహిస్తున్న మీ సేవా కేంద్రాన్ని సందర్శించారు. మీసేవా కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. 1బీ, అడంగల్, ఆదాయం తదితర సర్టిఫికెట్లకు రూ.25 నుంచి రూ.35 కాకుండా రూ.100 నుంచి రూ.150 వరకూ మీ సేవా నిర్వాహకులు వాసూలు చేస్తున్నారని ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ తనిఖీ చేశారు. మీసేవా సెంటర్లలో సర్టిఫికెట్లకు సంబంధించిన ధరల పట్టిక (బోర్డు) ఏర్పాటు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబురావు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు చెక్

– ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



పెనుకొండ ఎక్సైజ్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా చెక్ పెట్టేలా చర్యలు చేపట్టాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను అనంతపురం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులు, మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలు త్వరగా క్లియర్ చేయాలన్నారు. అలాగే కల్లు దుకాణల నుంచి కల్లు శాంపిల్స్ సేకరించి చిత్తూరు కెమికల్ ల్యాబ్‌కు పంపించాలని సూచించారు. కల్తీని అరికట్టేలా కల్లు అమ్మకందారులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. మద్యం అక్రమ రవాణాలో రెండు అంతకుమించి ఒక వ్యక్తి మీద కేసులు నమోదైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. అనంతరం తూముకుంట చెక్‌పోస్టును తనిఖీ చేసి సిబ్బంది విధులకు సరిగా హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిలమత్తూరు మండలం టేకులోడు క్రాస్ రోడ్డులో చంద్రప్ప నుంచి, అలాగే హిందూపురం పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గణేష్ నుంచి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. 245 ప్యాకెట్ల కర్ణాటక మద్యం, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు.

స్టేషన్ తనిఖీ

పెనుకొండ రూరల్: పట్టణ పరిధిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా చూడాలన్నారు. సీఐ సృజన్ బాబు, ఎస్‌ఐ, సిబ్బంది హాజరయ్యారు.

పావగడకు శారదా పీఠాధిపతి



ధ్యానముద్రలో విధు శేఖర భారతి స్వామిజీ

పావగడ: శృంగేరి శారదా పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతి స్వామిజీ బుధవారం సాయంత్రం పావగడకు విచ్చేశారు. సనాతన ధర్మం గురించి తెలియజేసేలా నిర్వహించనున్న విజయోత్సవ యాత్రలో భాగంగా ఆయన పావగడకు వచ్చారు. అనంతరం స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. బ్రాహ్మణ మహిళలు పూర్ణ కుంభం, కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. సేవాశ్రమాధిపతి స్వామి జపానంద, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎంఎస్ విశ్వనాథ్, కార్యదర్శి అనిల్ కుమార్, ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనందరావు, సుబ్బనరసింహ, అనంతరాం భట్, రఘునాథశర్మ, చెలువరాజన్, యజ్ఞనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జీజీ హట్టిలో మరోవారం పాటు వైద్య శిబిరం

రొళ్ల: మండలంలోని జీజీ హట్టి గ్రామాన్ని గత 11 రోజులుగా అతిసార వ్యాధి పట్టిపీడిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం జీజీ హట్టి గ్రామాన్ని పెనుకొండ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి సందర్శించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అతిసార పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టేంత వరకూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని సూచించారు. ఇంకా వారం రోజుల పాటు గ్రామాల్లో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. బుధవారం కొత్తగా అతిసార ఎవరి సోకకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి

హిందూపురం టౌన్: హిందూపురం వాటర్ సప్లయ్ పంప్ హౌస్‌లో పనిచేస్తున్న 25 మందికి ఐదు నెలలు వేతనాలు చెల్లించలేదని, వెంటనే వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు, వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, జిల్లా కోశాధికారి బాబు, తాలుకా కార్యదర్శి మారుతీరెడ్డి పాల్గొన్నారు.

కేబుల్ అపహరణ

రొళ్ల: మండల పరిధిలోని కేజీ గుట్ట కాలనీ సమీపంలోని కొత్తపాళ్యం తండా సమీపంలోని 544ఈ జాతీయ రహదారి పక్కన బోరుబావికి అమర్చిన కేబుల్‌ను దొంగలు అపహరించుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ స్టార్టర్ నుంచి మోటారు వరకూ అమర్చిన దాదాపు 15 మీటర్ల కేబుల్ చోరీ జరిగిందన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

పెనుకొండ: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకురాళ్లు బుధవారం సీడీపీఓకు సమ్మె నోటీసు అందజేశారు. మే 20న దేశ వ్యాప్త సమ్మె జరగనుందని, ఈ సమ్మెలో కార్మికులందరూ పాల్గొంటారని పేర్కొన్నారు. అనిత, అరుణ, సౌభాగ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎండల్లో హోయ్.. హోయ్



నీటి తొట్టెలో ఈత కొడుతున్న చిన్నారులు

లేపాక్షి: ఎండలు మండుతున్న తరుణంలో చిన్నారులతో పాటు పెద్దలు కూడా వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు స్విమ్మింగ్ పూల్స్, నీటి కుంటలు, బావుల వద్దకు వెళ్తున్నారు. సరదాగా ఈత కొడుతూ సేద తీరుతున్నారు. మండల కేంద్రమైన లేపాక్షికి కిలో మీటరు దూరంలో ఓ రైతు నిర్మించిన నీటి కుంటలో చిన్నా, పెద్దా ఈత కొడుతూ కేరింతలు కొడుతున్నారు.

వ్యాధులపై ఇంటింటి సర్వే



సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రంలో అతిసార, ఇతర వ్యాధులపై ఇంటింటి సర్వేను వేగవంతం చేయండి. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరంలో వైద్య చికిత్సలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి వైద్య సిబ్బంది సూచించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో పలువురు అతిసార (వాంతులు,విరేచనాల) లక్షణాలతో మడకశిర ఆస్పత్రిలో వైద్య చికిత్సలకు వెళ్లారని పేర్కొన్నారు. ముందు జాగ్రత్తగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. అతిసార, ఇతర వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అదే విధంగా సర్పంచ్ కరియన్న, గ్రామ కార్యదర్శి అశ్వత్థరెడ్డి, ఏఈ విజయకుమార్ దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మత్తు చేశారు. అదే విధంగా ట్యాంకర్ ద్వారా కూడా తాగునీటిని సరఫరా చేయిస్తున్నారు. కార్యక్రమంలో డాక్టర్ భార్గవి, జిల్లా వైద్యశాఖ డీఈ బాలజీనాయక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కాలిపోతున్న గుడిసె

అగళి: షార్ట్ సర్క్యూట్‌తో పొలంలో వేసిన గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లిలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడి వివరాలమేరకు.. పీ బ్యాడగేర గ్రామానికి చెందిన హనుమంతరాయప్పకు హెచ్‌డీ హళ్లి పొలిమేరలో మూడు ఎకరాల భూమిలో అప్పులు చేసి బోరు బావి వేయించుకున్నాడు. పొలంలో టెంకాయ గరులతో గుడిసె వేసుకుని అందులో స్టార్టర్ బిగించుకొని, డ్రిప్ పరికారాలు, పండించిన ఉల్లిగడ్డ బస్తాలు నిలువ ఉంచుకున్నాడు. బుధవారం విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గుల కారణంగా స్టార్టర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పులు చెలరేగి గుడిసె అంటుకుంది. గుడిసెలో ఉన్న సామగ్రి కాలి బూడిదైంది. దాదాపు 30 వేల రూపాయిలు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నారు.

కోడిగుడ్ల దుర్వినియోగంపై విచారణ

మడకశిర: మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కోడిగుడ్ల దుర్వినియోగంపై ఐసీడీఎస్ ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. కర్నూలు ఐసీడీఎస్ రీజనల్ కార్యాలయానికి చెందిన అధికారిణి మంజులాదేవి ఆధ్వర్యంలో పలువురు అధికారులు మడకశిరకు చేరుకుని విచారణ చేపట్టారు. మడకశిరలోని ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ సాగింది. దేశ వ్యాప్తంగా కరోనా విజృంభించిన సమయంలో లాక్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన కోడిగుడ్లు పెద్ద ఎత్తున దారి మళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై ఇంతకు ముందు విజిలెన్స్ అధికారులు కూడా మడకశిర ఐసీడీఎస్ కార్యాలయంపై దాడి చేసి రికార్డులను తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆశాఖ అధికారులు విచారణ చేపట్టారు. క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. అంతే కాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలను ఐసీడీఎస్ కార్యాలయానికి పిలిపించి నేరుగా వారిని విచారణ చేశారు. పలు వివరాలను సేకరించారు.

కూలీల ఆందోళన

రొద్దం: నాలుగు వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు వేంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్ లోచెర్ల గ్రామ సచివాలయం వద్ద కూలీలు ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ మండలంలోని ఆర్ఎల్ కొత్తూరు, ఆర్ లోచెర్ల గ్రామాల్లో పనులు చేసిన కూలీలకు నాలుగు వారాలు గడుస్తున్న వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

భవిత సెంటర్‌కు వచ్చేలా ప్రోత్సాహం

పెనుకొండ: ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను భవిత సెంటర్‌కు వచ్చేలా ప్రోత్సహించాలని జిల్లా సహిత విద్యాధికారి ఆనంద్ బాబు పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించేందుకు బుధవారం పట్టణంలోని బోయపేట, అర్బన్‌కాలనీ, కుమ్మరిగేరి తదితర ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు గ్రామానికి చెందిన వాసంతి అనే యువతి ఆదివారం అదృశ్యమైనట్లు కియా పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే వాసంతి బుధవారం అదే గ్రామానికి చెందిన మధుకుమార్ అనే యువకుడిని వివాహం చేసుకొని రక్షణ కోసం కియా పోలీసులను ఆశ్రయించారు. వారిద్దరూ మేజర్లు కావడవంతో తహసీల్దార్ శ్రీధర్ ముందు హాజరు పరచి, ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం

హిందూపురం: పట్టణంలోని మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడి విద్యార్థులకు విజయవాడ రవి పబ్లికేషన్ అధినేత ఆంజనేయరావు అందించిన అచ్చు పుస్తకాలను బుధవారం ఎంపీడీఓ సరస్వతి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. స్టడీ మెటీరియల్ అందిస్తూనే కరాటే, కంప్యూటర్, యోగా, డ్రాయింగ్, చక్కని దస్తూరి, సంగీతం, నత్యం తదితర అంశాలలో శిక్షణ ఇవ్వడం హర్షణీమన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు మాళప్ప, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ గురువు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.